# నొప్పించక తానొవ్వక...

ఇండియానించి వచ్చిన అర్జునరావ్‌కి నెలరోజుల్లోనే అమెరికామీద విసుగు పుట్టింది.

ఆరోజు తన బావ కృష్ణ ఇంటికి వెళ్ళి, అక్కడ భోజనం చేశాక అదే మాట అన్నాడు అతనితో.

కృష్ణ నవ్వాడు. "అప్పుడే అమెరికా అంటే బోరు కొట్టేసిందా? నేను పాతికేళ్ళనించీ ఇక్కడే వుంటున్నాను. నాకింకా బాగానే వుందే" అన్నాడు.

"ఏమో! నాకంతా అయోమయంగావుంది. మనం ఎడ్డెం అంటే వీళ్ళు తెడ్డెం అంటారు. నాకు నచ్చలేదు" అప్పుడే ఇండియానించి హెచ్ వన్ వీసా మీద వచ్చి, హైటెక్ కంపెనీలో కష్టమర్ సపోర్ట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అర్జునరావ్ అన్నాడు.

నవ్వాడు కృష్ణ. "నీకేం నచ్చలేదో చెప్పు"

"నా పేరే పలకటం రాదు వీళ్ళకి. నేను ఇంగ్లీష్ ఎంత చక్కగా మాట్లాడినా అర్థమయి చావదు"

"అవును! మామయ్య నీకు భట్టిప్రోలు సీతారామాంజనేయవరప్రసాదభీమార్జునరావ్ అని రామాయణాన్ని భారతాన్ని కలిపి ఒహ మహా పేరు పెట్టాడు కదా! సుబ్భరంగా అందరికీ రావ్ అని చెప్పు. పిలవటానికి సులభంగా వుంటుంది. అందులోనూ కష్టమర్ సపోర్ట్‌లో పనిచేస్తున్నప్పుడు పేరు పెద్దదిగావున్నా కష్టంగావున్నా పలకటం కష్టం. అలాగే మనం ఇంగ్లీష్‌లో మాట్లాడగలిగినా మన యాస వేరు. ఒక మలయాళంవాడో హిందీవాడో ఇంగ్లీష్‌లో మాట్లాడితే, మనకే కొన్ని మాటలు అర్థం కావు. ఇక వీళ్ళకేమర్థమవుతుంది?"

"వీళ్ళ ఇంగ్లీషూ అంతే... మనకి అర్థమయి చావదు"

కృష్ణ నవ్వుతూ అన్నాడు. "అదే కదురా చెబుతున్నది అర్జునా! మనం ఇక్కడ బ్రతకటానికివచ్చాం వీళ్ళతో రోజూ మాట్లాడకతప్పదు. అందుకని కొంచెం శ్రమపడి, అందరికీ అర్థమయేటట్టుగా నెమ్మదిగా మాట్లాట్టం అలవాటు చేసుకో. ఇండియాలో మనం చాల తొందరగా మాట్లాడతామని నాకు ఇక్కడికి వచ్చేదాకా తెలీదు. మన భాషల్లో స్పీడెక్కువ. మనకి అలవడిన బ్రిటిష్ ఇంగ్లీషులోకూడా స్పీడెక్కువ. అదే మనం అమెరికన్స్‌తో మాట్లాడేడప్పుడు చూపిస్తాం. అందుకని క్లియర్‌గా, మెల్లగా మాట్లాడటం అవసరం. అలాగే అమెరికన్ ఇంగ్లీష్‌ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. ఒకవేళ అర్థం కాకపోతే వాళ్ళని విమర్శిస్తూ కూర్చోక, మొహ

మాటం లేకుండా అడుగు. నాకు అర్థం కాలేదు. మళ్ళీ చెప్పండి అని. వాళ్ళేమీ అనుకోరు.... "

"ఒక మీటింగ్‌లో నేను చేతులు కట్టుకుని కూర్చుంటే.. కొంచెం ఓపెన్‌గా వుండాలి నువ్వు అన్నాడు మా బాస్ జాన్. అతనేమంటున్నాడో అర్థం కాలేదు"

"కమ్యూనికేషన్లో మూడు రకాలు వున్నాయి. ఒకటి విజువల్ టైప్. రెండోది ఆడియో టైప్. మూడోది ఫీలింగ్ టైప్. విజువల్ టైప్ అంటే కాళ్ళూ చేతులూ ఊపుతూ, కళ్ళు తిప్పుతూ, భుజాలు ఎగరేస్తూ అంటే బాడీ లాంగ్వేజ్ చూపిస్తూ మాట్లాడటం. చాలమంది అమెరికన్లూ, యూరోపియన్లూ మాట్లాడే పద్ధతి ఇదే. దీంట్లో ముఖ్యమైనది ఒకళ్ళ కళ్ళల్లోకి ఇంకొకళ్ళుచూస్తూ మాట్లాడటం. అలా చూపులు కలిసిన శభవేళ చాల పనులు నిర్విఘ్నంగా జరుగుతాయి. ఎదుటివాళ్ళు మాట్లాడేటప్పుడు, మనం ఎటో చూస్తుంటే, మనం అబద్ధాలాడుతున్నట్టు, మనకి ఆ విషయం మీద ఉత్సాహం లెనట్టూ, మనం తలపొగరుగా వున్నట్టూ అర్థం. అలాగే చేతులు కట్టేసుకుని కూర్చుంటే, నా అభిప్రాయాలు నావి. మీ అభిప్రాయాలతో నాకేమీ సంబంధం లేదు అని. అందుకే నీ బాసురుడు, ఓపెన్‌గా వుండమన్నాడు నీతో"

"మరి ఆడియో టైపు అంటే?" అడిగాడు అర్జునరావ్.

"చెబుతున్నాను. ఆకాశవాణి. వార్తలు చదువుతున్నది ఏడిద గోపాలరావ్ అని రేడియోలో వార్తలు చెబుతారే అదీ. అలాగే మా రోజుల్లో నండూరి సుబ్బారావూ, డి. వెంకట్రామయ్యా.... రేడియో నాటికల్లోనూ, తదితర కార్యక్రమాల్లోనూ మాట్లాడతారే అదీ. వాళ్ళు మాట్లాడే పద్ధతిలో ఎంతో భావగర్భితంగా మాటలు సందర్భానుసారంగా విరిచి చెబుతారు. అందుకని వాళ్ళని మనం చూడకపోయినా, మన కళ్ళ ముందర వున్నట్టే వుంటుంది. అంటే వీళ్ళది ఆడియో టైప్ కమ్యూనికేషనన్నమాట. ఇక మూడవ రకం ఫీలింగ్ టైపని చెప్పాను కదా. వీళ్ళ ముఖంలో ఎన్నో భావాలు కనిపిస్తూ వుంటాయి. అబ్బా.. ఆ అమ్మాయిని చూస్తే ఓహ్.. కళ్ళు తిరిగి పోతాయనుకో. ఎంత అందం... ఊహ్.... ఎంత నాజూకుగా నడుస్తుందో.... నోటితో చెప్పటం చాల కష్టం బాబూ- అలా ముఖంలో హావభావాలు మాటల్ని మరుగున పడేస్తాయి. శంకరాభరణం శంకరశాస్త్రి చెప్పినట్టుగా అవి నాభి దగ్గర మొదలయి, హృదయం మీదుగా ఇంకా కొన్ని భావాలను పులుముకొని నోటిలోనించీ బయటకి వస్తాయి. ఒక్కొక్కసారి అలా నోట్లోనించి బయటికి రావటానికి కుసింత ఆలస్యమయే అవకాశం వుంది. దానివల్ల వినేవాళ్ళకి చిటికెడో పిడికెడో బోరుకొట్టే అవకాశమూ వుంది.... "

"అయితే మనం ఆ మూడో రకమేమో అని.. నాకు అనిపిస్తున్నది" అన్నాడు అర్జునరావు ఆలోచిస్తూ. అలా అంటున్నప్పుడు అతని మాటలు వినపడుతుంటే, అతని ఆలోచనలు కనపడుతున్నాయి.

నవ్వాడు కృష్ణ "ఈ పద్ధతి కొన్ని సందర్భాల్లో బాగానే వుంటుంది కానీ త్వరత్వరగా బిజినెస్ చేసుకుని వెళ్ళాలనుకునే వాళ్ళకి విసుగు పుట్టిస్తుంది"

"నిన్న జాన్ ఏమని అడిగాడో తెలుసా? అమెరికాలో రోడ్డుకి కుడిపక్కన

కారు నడుపుతారు కదా, మరి మీ దేశంలో ఎటు పక్కన నడుపుతారు అని. నేను ఎడమ పక్కన నడుపుతాం, అదే సరైన పద్ధతి అని చెప్పాను. అతనికి నా మాటలు నచ్చినట్టు లేదు... "

"అక్కడే దెబ్బతిన్నావంటాను. ఎడమ పక్కన, అది అక్కడి పద్ధతి అని చెప్పి ఆపేయవలసింది. ఏది సరైన పద్ధతి ఏది కాదు అని నిర్ణయించేది నువ్వూ కాదు జానూ కాదు. ఇది అమెరికన్ పద్ధతి. అమెరికాలో వందల ఏళ్ళుగా పని చేస్తున్నది అలాగే అది ఇండియాలో సరైన పద్ధతి. అనవసరపు చర్చలకి దిగినందువల్ల ఎవరూ వాళ్ళ అలవాట్లనూ, పద్ధతుల్నీ మార్చుకోరు. లేనిపోని హైరాన తప్ప మా శంకర్ ఇలాటి ప్రశ్నే ఎవరో అడిగితే, ఏం చెప్పాడో తెలుసా? మీరు కుడి పక్కన మాత్రమే నడుపుతారా? మేం ఎటు పక్క ఖాళీగా వుంటే అటుపక్క నడుపుతాం - అని జోక్ చేశాట్ట. దీనివల్ల అతనేమీ ఇండియాని కించపరచలేదు. అలా హాస్యంగా సరదాగా మాట్లాడటం వల్ల సహోద్యోగులు అతనికి బాగా దగ్గరయారు కూడానూ. వాళ్ళూ అమెరికా గురించి జోకులు వేస్తూనే వుంటారు.ఇది మామూలే"

అమెరికన్లు స్వతహాగా చాల స్నేహంగా వుంటారు. వాళ్ళ జీవితాలకి మనం అడ్డం కానంత వరకూ మనకి సహాయం కూడా చేస్తారు. ఏదన్నా చేయలేక పోతే, మొఖమాటం లేకుండా ముఖం మీదే చెబుతారు. వాళ్ళకి మనమేదన్నా సహాయం చేస్తే, నువ్వు నాకు సహాయం చేశావు కనుక నేను నీకేదన్నా సహాయం చేయాలి అంటారు. మనకిదేదో వింతగా వుంటుంది కానీ, వాళ్ళ ఉద్దేశ్యం మాత్రం, నీ ఋణం వుంచుకోను అని. మనం మనసు విప్పి మాట్లాడితే వాళ్ళూ అలాగే చేస్తారు. కాకపోతే వాళ్ళెంతో దగ్గరి స్నేహితులయితే తప్ప, ఆఫీసుల్లోనూ, ఇంటి దగ్గరా సంభాషణలో కొన్ని విషయాలు మాట్లాడకుండావుంటే మంచిది. ముఖ్యంగా మతం, దేశవిదేశ రాజకీయాలులాటివి. ఇంటి దగ్గర సంభాషణ సాధారణంగా వాతావరణం దగ్గర మొదలై, పిల్లల గురించీ, ప్రయాణాలూ, స్టాక్ మార్కెట్, సినిమాలు, ఫుట్‌బాల్‌లాటి ఆటల గురించీ సాగుతుంది.

ఇండియా అమెరికాలు భూగోళం మీద తూర్పు పడమరల్లో వున్నాయి. వేరే దేశాలు వేరే భాషలూ వేరే సంస్కృతులూ. ఆ రెండిటినీ ఒకే ఒరలో పెట్టాలను కోవటం శుద్ధ అవివేకం. అలాగే, బి ఎ రోమన్ ఇన్ రోమ్ అన్నారు. మరి అమెరికాలో సుఖజీవనం కోసమైనా అమెరికన్లలా వుండద్దూ. అన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్న పద్యం గుర్తుందా? అలాగే ఏ మంచి పని చేసినా, సహాయం చేసినా వెంటనే ధన్యవాదాలు చెప్పటం, విమర్శించాల్సి వచ్చినప్పుడు, కొంచెం ఆలోచించి వ్యక్తిగత విమర్శలా కాకుండా ఆ కార్యాకారణ సందర్భంగా చెప్పటం మంచిది" అన్నాడు కృష్ణ.

"ఓకే.. నీ సలహాలు.. ఏవో.. బాగానే వున్నట్టు.. వున్నాయి" అన్నాడు అర్జునరావ్ ఆలోచిస్తూ, భుజాలు ఎగరేసి.

* * *